క్లుప్తంగా

వీసీ ఆకస్మిక తనిఖీ



ఆకస్మిక తనిఖీ చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిపాలనా భవనంలో పరీక్షల విభాగం, అభివృద్ధి, ఫైనాన్షియల్ డిపార్ట్‌మెంట్, ఈడీపీ సెల్‌తో సహా పలు కీలక విభాగాలను వీసీ అప్పారావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతూ, కార్యాలయంలో క్రమశిక్షణ, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని, వర్సిటీ ప్రతిష్టను నిలబెట్టడానికి ఉద్యోగులు నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని ఆయన కోరారు.

'అంకుర'లో అరుదైన శస్త్ర చికిత్స



శిశువుతో అంకుర వైద్యులు

తిరుపతి తుడా: స్థానిక అంకుర ఆసుపత్రిలో వైద్యులు ఆరు నెలల శిశువుకు అరుదైన ఆపరేషన్ చేశారు. అత్యంత అరుదుగా కనిపించే అపెండిక్యులర్ అబ్సెసివ్ కోసం లాపరోస్కోపిక్ అపెండెక్టమీ శస్త్రచికిత్స చేశారు. హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, ఈ వ్యాధి నెలల వయసు శిశువులో అరుదని, ఇది సంక్లిష్టమైన సమస్య అని చెప్పారు. సకాలంలో రోగ నిర్ధారణ చేయడంతో పాటు వివిధ విభాగాల సమన్వయంతో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశామన్నారు.

పృథ్వీ హీరో షోరూం ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న రవాణాశాఖ అధికారి మురళీమోహన్, షోరూం అధినేతలు పృథ్వీ ,మోహన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన పృథ్వీ హీరో రెండవ షోరూమ్‌ను గురువారం తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ షోరూమ్ అధినేతలు పృథ్వీ, మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. పృథ్వీ మాట్లాడుతూ వినియోగదారులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ద్విచక్ర వాహనాలను తక్కువ ధరకే ఇస్తున్నామన్నారు. వారి నుంచి లభిస్తున్న ఆదరణతో రెండో షోరూమ్‌ను ప్రారంభించామని, దీనిద్వారా కూడా వినియోగదారుల మన్ననలు పొందుతామన్నారు. రవాణాశాఖ అధికారి మాట్లాడుతూ, ద్విచక్రవాహనదారులు రోడ్డు నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

సీసీరోడ్డు ప్రారంభం



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి తుడా: 44వ డివిజన్ మధురానగర్ లో రూ. 36.65 లక్షలతో వేసిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. నగరంలోని రోడ్ల ప్యాచ్ వర్క్‌లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇదలా ఉంచితే, నర్సరీరోడ్డు ఆక్రమణలతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు సమస్యను ఆయనకు నివేదించారు. కార్పొరేషన్ ఎస్ఈ, ఎంఈ గోమతి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

11న మాలల ఆత్మీయ గౌరవ సభ

తిరుపతి కల్చరల్: మాలల ఐక్యత, ఆత్మగౌరవ పరిరక్షణే లక్ష్యంగా ఈనెల 11న తిరుపతిలో నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని మాలల ఆత్మీయ గౌరవ సభ చీఫ్ కో-ఆర్డినేటర్, సీనియర్ దళిత నేత మల్లారపు మధు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మంగళం రోడ్డులోని ఆర్టీఓ కార్యాలయం ఎదురుగానున్న ఆశా కన్వెన్షన్ హాల్లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ సభ నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు.



తిరుపతి రూరల్: అమ్మాయి కాదు అబ్బాయే..



తిరుపతి గంగమ్మకు పరదాలు సమర్పిస్తున్న పరదాల మణి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు





బండ వేషాలు



దుత్తలతో వస్తున్న భక్తులు

బండవేషాలతో సందడి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ గంగజాతరలో భాగంగా రెండోరోజు గురువారం భక్తులు బండ వేషాలతో నగర పురవీధులు హోరెత్తాయి. ఉదయం నుంచి రాత్రి వరకు బండ వేష భక్తుల సందడి కనిపించింది. వయోభేదం లేకుండా వేషధారణలతో గంగమ్మ ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. కొందరు భక్తులు కుటుంబ సమేతంగా ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు చేశారు. తాతయ్యగుంట గంగమ్మ బండ వేషధారణ, ప్రత్యేక అలంకరణలో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు.

-జాతరలో నేడు 'తోటి వేషం'

జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం తోటి వేషాలతో గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు.

నోటీస్ బోర్డు

- శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా తోటి వేషాలలో అమ్మవారిని భక్తులు దర్శించుకుంటారు.
- ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో ఉదయం 9 గంటలకు ×మన పల్లె జానపద జాతర‡ ప్రారంభం.
- టీటీడీ పరిపాలన భవనం వద్ద ఉదయం 10 గంటలకు కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతామోహన్ ఆధ్వర్యంలో నిరసన.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం, 11 గంటలకు సీపీఎం అఖిల భారత కార్యదర్శి ఎంఏ బేబి మీడియా సమావేశం.
- టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు అధ్యక్షుడు ఆధ్వర్యంలో టీటీడీ ఏడీ బిల్డింగ్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి సన్నిధి నుంచి గంగమ్మ ఆలయం వరకు సాయంత్రం 4 గంటలకు సారె ఊరేగింపు, సమర్పణ.
- శ్రీగోవిందరాజస్వామి బుగ్గోత్సవాల ప్రారంభం సందర్భంగా మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5.30 గంటలకు ఉయ్యాలసేవ, ఆస్థానం.

పరామర్శ



గంగమ్మ ఆలయ మాజీ డైరెక్టర్ జీవరత్నంను పరామర్శిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్న 22వ డివిజన్ కార్పొరేటర్ పైడి సునీత, ఎంఆర్‌పల్లెకు చెందిన కిషోర్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి కుమారుడు తరుణ్, గంగమ్మ ఆలయ మాజీ డైరెక్టర్ జీవరత్నంను గురువారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. అందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు బ్రహ్మనందరెడ్డి, చంద్రయ్య, నాయకులు శేఖర్‌రెడ్డి పడమటి కుమార్, అనిల్, డిష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి పార్టీ కూసాలు కదిలిద్దాం..!



సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



హాజరైన పాకాల మండల పార్టీ ముఖ్య నేతలు

-పార్టీ నేతలతో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: ప్రజా వ్యతిరేకత మూటకట్టుకున్న కూటమి పార్టీ కూసాలు కదిలించేందుకు కలసికట్టుగా పోరాటం చేయాలని, తద్వారా క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసంలో పాకాల మండల పార్టీ నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవల పార్టీ పదవులు పొందిన వారంతా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షంగా పోరాటాలు చేయడం కొత్తదేమీ కాదని, ఇప్పుడు ప్రజల తరపున పోరాటాల దూకుడు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగనన్న స్ఫూర్తితోనే ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని ఎండగడదామన్నారు.

తప్పు చేసిన పోలీసులను ప్రశ్నించాలి

పాకాల మండలంలో పార్టీకి చెందిన ఏ ఒక్క నాయకుడినైనా పోలీసులు బెదిరించినా, తప్పుడు కేసులు పెట్టినా అందరూ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ప్రశ్నించాలని, నిలదీయాలన్నారు. చట్టాన్ని అతిక్రమించి, ఉద్దేశపూర్వకంగా అదుపులోకి తీసుకుని వేధిస్తే ఉపేక్షించరాదన్నారు. ప్రభుత్వ అధికారులు ఎక్కడ తప్పు చేసినా నిలదీయాలని, ఆ పోరాటానికి పార్టీ క్యాడర్‌తో పాటు తానూ వచ్చి అండగా నిలబడతారన్నారు.

ముగిసిన గంగ జాతర

●ముగింపు వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి



గంగమ్మ ప్రతిమను గ్రామస్తులతో కలసి ఊరేగింపుగా తీసుకు వెళుతున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని 20 గ్రామాల్లో రెండు రోజుల గంగమ్మ జాతర వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. తొలుత మంగళవారం రాత్రి గ్రామ శివార్ల నుంచి గంగమ్మ ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామ పెద్దలు నడివీధిలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రంతా ఆలయం ముందు ఆటపాటలు, వివిధ వేష దారణల్లో భక్తులు చిందులేశారు. గురువారం ఉదయం నడివీధుల్లో కొలువుదీర్చిన గంగమ్మ ప్రతిమలను మేళతాళాలు, డప్పు వాయిద్యాల హోరు, భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఆయాగ్రామాల ప్రజలు పెద్ద ఎత్తునపాల్గొని కర్పూరనీరాజనాలు సమర్పించారు.

ప్రత్యేక ఆకర్షణగా తుమ్మలగుంట ఆలయం

తుమ్మలగుంటలో నడివీధి గంగమ్మ జాతర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అలాగే జాతర ముగింపు వేడుకల్లో అమ్మవారి ప్రతిమను మోసుకుని గ్రామంలో ఊరేగించారు. అలాగే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మకు పుట్టినిల్లు అయిన అవిలాలలో గంగమ్మ ప్రతిమలను యువతీ యువకులు ఘనంగా ఊరేగించారు.

తిరుచానూరు సర్పంచ్‌కు పితృవియోగం



ఏలుమలై రెడ్డి భౌతికకాయానికి నివాళులుఅర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి, రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి

తిరుపతి రూరల్/చంద్రగిరి: రూరల్ మండలంలోని తిరుచానూరు గ్రామ పంచాయతీ సర్పంచ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామచంద్రారెడ్డి తండ్రి ఏలుమలై రెడ్డి (77) బుధవారం రాత్రి హఠాన్మరణం చెందారు. ఇది తెలుసుకున్న నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఆయన తల్లి చెవిరెడ్డి లక్ష్మి, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గురువారం ఉదయం ఏలుమలైరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్రా రెడ్డి, ఆయన సోదరుడు ఎంపీటీసీ నరేష్‌రెడ్డి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.అలాగే తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వర్ రెడ్డి, ఏకవీర ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రతాప్ స్వామిజీ, వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచులు, నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన ఎంపీటీసీలు, నాయకులు పెద్ద ఎత్తున నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి



సాయి కిరణ్ (ఫైల్)

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు..పాకాల మండలం పోలిరెడ్డిగారి పల్లెకు చెందిన సాయి కిరణ్(23) వ్యక్తిగత పనులపై బుధవారం మధ్యాహ్నం పాకాల నుంచి తిరుపతి వైపు వస్తుండగా పనపాకం టోల్‌ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. 108లో అతడిని తిరుపతి రుయాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుయాలో తలసేమియా దినోత్సవం



మాట్లాడుతున్న బాలకృష్ణనాయక్

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో పీడియాట్రిక్స్ విభాగం గురువారం ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ, తలసేమియా అంటే హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో లోపం వల్ల వచ్చే వారసత్వ రుగ్మత అని, ఎర్ర రక్తకణాలలో ఆక్సిజన్‌ను తీసుకెళ్లడానికి సహాయపడే ఒక ప్రొటీన్ తక్కువగా ఉండడమేనని, రక్తహీనత, అలసట, శరీరం రంగు పాలిపోవడం, ఎదుగుదల, ఆలస్యం, వంటి లక్షణాలు ఉంటాయని తెలియజేశారు. కుటుంబంలో ఎవరికైనా తలసేమియా ఉన్నట్లయితే కుటుంబ సభ్యులందరూ ఆ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం ఉచితంగా ఎక్కిస్తామన్నారు. పీడియాట్రిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్, ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ ప్రదీప్, ల్యాబ్ టెక్నీషియన్ మోహన్ పాల్గొన్నారు.

గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి చేయండి

● సమీక్షలో స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశం



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ నిధులతో నగరపాలక సంస్థ పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనులు గడువు లోపు పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న స్విమ్మింగ్ పూల్, సిటీ ఆపరేషన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డిజైన్ స్టూడియో, గ్లో గార్డెన్, గరుడ వారధి తదితర ప్రాజెక్టుల పనుల పురోగతిపై ఆయా ప్రాజెక్టుల ప్రతినిధులు, స్మార్ట్ సిటీ అధికారులతో గురువారం ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీతో కలసి ఆమె సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, వినాయక సాగర్‌లో ఏర్పాటు చేస్తున్న గ్లో గార్డెన్, స్విమ్మింగ్ పూల్ పనులు, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు ఆలస్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈఈ రవి, డీఈలు రాజు, మహేష్, మధు,ఏఓ రాజశేఖర్, సీఏఓ మల్లిఖార్జున, వివిధ ప్రాజెక్టుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్లపై దుకాణాలొద్దు

తిరుపతి తుడా: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై దుకాణాలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. గంగజాతర నేపథ్యంలో ఆలయంలో భక్తులకు కల్పించిన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలసి ఆమె గురువారం పరిశీలించి ఆమె మాట్లాడారు. ప్రధానంగా ఆలయ పరిసరాల్లో రోడ్లపై దుకాణాలు పెట్టడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రోడ్లపైకి రాకుండా లైన్లు వేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను, ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. 24 గంటలు అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, తులసి కుమార్, ఆలయ ఈఓ జయకుమార్, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు, శానిటరీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

వాన కుమ్మేసింది..!



తిరుపతిలో జలమయమైన రోడ్డు

చంద్రగిరి: ఉదయం నుంచి చంద్రగిరిలో భానుడు భగభగలాడుతూ తన ప్రతాపం చూపించాడు. ప్రజలు ఎండ తీవ్రతకు ఇళ్లకే పరిమితమయ్యారు. గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారింది. 5 గంటలకు నల్లమబ్బులు కమ్ముకుని దాదాపు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి ప్రజలకు ఉపశమనం లభించింది.

తిరుపతిలో..

తిరుపతి తుడా: తిరుపతి పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం 6.15 నుంచి గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. తిరుపతి గంగ జాతర నేపథ్యంలో భక్తులు వర్షంలోనే తడుస్తూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మార్కెట్ వద్ద చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, తట్ట వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

పాకాలలో..

పాకాల: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలకు ఎండల నుంచి ఉపశమనం లభించింది. గంట పాటు తేలికపాటి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. గాలి లేకుండా వర్షం కురవడంతో మామిడి రైతుల్లో ఆనందం తొంగిచూసింది.

భౌ..భౌల వేట..!



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర వేడుకల్లో భక్తుల తాకిడి పెరిగింది. మరోవైపు ఆలయం వద్ద కుక్కల హడావిడి కూడా ఎక్కువగానే ఉంది. ఆలయానికి వచ్చే భక్తులు వీటి ధాటికి హడలిపోతున్నారు. దీంతో కార్పొరేషన్ సిబ్బంది రంగంలోకి దిగారు. ఆలయం వద్ద కుక్కలను పట్టుకుని తీసుకెళ్లారు. ఆలయ పరిసరాల్లో కుక్కల బెడద లేకుండా చేశారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

మూగజీవికి కొత్త జీవితం



తిరుపతి సిటీ: కాలు విరిగి నిలబడలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఓ దూడకు హెల్పింగ్ హార్ట్స్ సంస్థ సభ్యులు శస్త్ర చికిత్స చేయించారు. దానికి కొత్తజీవితం ప్రసాదించారు. వివరాలు..తిరుపతి ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ వద్ద కాలు విరిగి నడవలేని స్థితిలో బాధపడుతున్న దూడను గమనించిన హెల్పింగ్ హార్ట్స్ ప్రతినిధులు కల్లుపల్లి సురేందర్ రెడ్డి, చంద్రగిరి కిశోర్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, శేఖర్ నాయర్, చంద్ర చలించారు. వెంటనే ఆ దూడను సమీపంలోని ఇందిరానగర్‌కు చెందిన స్థానికుల సహకారంతో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశువైద్యశాలకు తీసుకెళ్లారు. హాస్పిటల్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథ్, డాక్టర్ భారతి, వైద్య బృందం స్పందించారు. దూడకు వైద్యం చేశారు. విరిగిన కాలుకు అల్యూమినియం రాడ్‌లతో అల్యూమినియం రాడ్లతో పిండికట్టు వేసి శస్త్ర చికిత్స చేశారు.

సమాజానికి మహాభారతం మార్గదర్శి



ప్రవచన కర్తను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా అన్నమాచార్య కళామందిరంలో నిర్వహిస్తున్న ×విరాటపర్వం‡ ప్రవచనం గురువారం రాత్రి ముగిసింది. చివరి రోజు ప్రవచనకర్త డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ, మహాభారతం సమాజానికి మార్గదర్శిగా పని చేస్తుందని, నైతిక విలువలను తెలియజేస్తుందన్నారు. ముఖ్య అతిథిగా ఎస్వీయూ విశ్రాంత ఉపకులపతి ఆచార్య రాళ్లపల్లి రామమూర్తి ప్రత్యేక అతిథిగా భారతీయ విద్యా భవన్ సంచాలకుడు సత్యనారాయణరాజు, ప్రవచనకర్త విభీషణశర్మ మాట్లాడారు. ప్రవచన కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షణకు దోహదం చేస్తాయన్నారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి సురేంద్ర నాయుడు, డాక్టర్ ద్వారం లక్ష్మి, ఆచార్య దేవసేన నాయుడు, జీఎల్.మనోహర్, నగర ప్రజలు పాల్గొన్నారు.



